సుమిత్ర మరణించింది.

తను నవ్వు ఆపుకోలేకపోతున్నాడు. కొండ వాగులాగా తన నవ్వు పెరుగుతోంది. జలపాతంలాగా హోరు పెడుతోంది.

ప్రపంచకమంతా వినిపిస్తోంది. తన నవ్వు బంగారాన్ని పండించే తన పొలాలనుంచి వినిపిస్తోంది. ఆ నవ్వు కొండలు కోనలనుంచి ప్రతిధ్వనిస్తోంది. ఆ నవ్వు పులివాగులో వినిపిస్తోంది. తన నవ్వు పుచ్చపువ్వులాంటి వెన్నెలలో వినిపిస్తోంది తన నవ్వు.

ఎటువిన్నా అంతులేని ఆనందం! అట్టహాసం! ఎటు చూసినా అంతులేని వెలుగు!

యీ అట్టహాసానికి అంతరాయంగా తుపాకుల మోతలు తన రక్తంలోకి చొచ్చుకొని పోతున్న చాకులు బరిసెలు.

అస్పష్టంగా వినిపిస్తున్న ధ్వనులు. అంతులేని ఈ వెలుగుని కప్పివేస్తున్న గుప్పెడు చీకటి - ఎటుచూసినా ఒక్క గుప్పెడు చీకటి !

## 'మరీచిక'

"శ్యామల టీచరుగారికి చాలా సీరియస్‌గా వుంది. మీరు దయచేసి వెంటనే రావాలి"

సరస్వతి

నేను ఆఫీసునుంచి యింటికి వచ్చేసరికి నాకోసం ఎదురుచూస్తున్న టెలిగ్రాము ఇది.

శ్యామల టీచరు ఎవరూ? ఈ సరస్వతి ఎవరూ? ఎక్కడో ఆంధ్రదేశానికి రెండువందల మైళ్ళనుంచి ఈ టెలిగ్రాము నాకు ఎల్లా వచ్చింది?

ఆవిడ ఎవరికో సీరియస్‌గా వుంటె నేను రావటం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం ఎక్కడా దొరకలేదు.

సరాసరి వంట యింట్లోకి వెళ్ళి ఈ టెలిగ్రాము ఎక్కడనుంచి వచ్చిందో నీకు తెలుసా అని మా ఆవిడని అడిగాను. ఆవిడ నా వంక చూడకుండానే.

"తెలియడానికేముంది, వెంటనే బయలుదేరి వెళ్ళండి" అని అంది.

ఈ శ్యామల ఎవరో నీకు తెలుసా?

"మీ స్నేహితురాళ్ళ అందరి పేర్లు నాతో చెబుతున్నారా!" అని ఎదురు ప్రశ్న వచ్చింది.

అక్కడనుంచి మా అమ్మ దగ్గరకు వెళ్ళాను. టెలిగ్రాము చూపించాను. ఎవరమ్మా ఈ శ్యామల?" అని అడిగాను.

"నీ వ్యవహారాలు నా కేం తెలుసు నాయనా" అని ఆవిడ వత్తులు చేసుకుంటూ కూర్చుంది.

అక్కడనుంచి భాష్యం చదువుకుంటున్న మా నాన్నగారి దగ్గరకు వెళ్లి ఆ టెలిగ్రాము చూపించాను.

"ఎవరండీ ఈ శ్యామల మీ కేమన్నా తెలుసా?" అని అడిగాను.

ఆయన నావంక కోపంగా చూశారు. ఆయనకు కోపం వస్తే మౌనం మరింత ఎక్కువ అవుతుంది.

"మనుష్యులను అంత తొందరగా మరచిపోవటం మంచిదికాదు రామం" అని ఆయన అన్నారు.

నేను అక్కడినుంచి మా అక్కయ్యవాళ్ళ యింటికి వెళ్ళాను.

రారా తమ్ముడూ అంటూ నన్ను ఆపేక్షగా పలకరించింది. నేను టెలిగ్రాము చూపించాను.

"శ్యామల!" నీతో కాలేజీలో చనువుగా వుండేది ఆ అమ్మాయి పేరు ఏమిటి.

ఆ అమ్మాయి పేరు శ్యామల కాదు.

ఇంటికి వచ్చి అన్నయ్యకు చూపించాను.

"నీ డైరీలో ఎక్కడైనా రాసుకున్నావేమో చూడు" అని అన్నాడు.

శ్యామల అనే పేరుగల వ్యక్తి నా జీవితంలో ఎక్కడా తారసిల్లినట్టు గుర్తులేదు.

కాని ఎవరైతేనేం ఆ వ్యక్తి చాలా ప్రమాదమైన స్థితిలో వుంది. నా సహాయం అర్థిస్తోంది.

వెళ్ళి తీరాలి వెంటనే వెళ్లాలి కాని ఎలా! వెళ్ళడం!

శ్యామలవున్న ఊరు పేరు తెలుసు, ఆవిడ టీచరు అని తెలుసు. అంతే, అంతకుమించి ఏమీ తెలియదు.

"అక్కడికే వెళ్ళి కనుక్కుందాం"

ఆ రోజు రాత్రి బయలుదేరి మదురాసు మీదుగా శ్యామలావాళ్ళ వూరు వెళ్ళాను.

నేను చేరేసరికి ఉదయం తొమ్మిది గంటలు దాటింది.

ఊరు చూస్తే ఇటు పల్లెకాదు అటు పట్టణం కాదు. ఒక హోటల్ కు వెళ్ళి దిగాను. ఈ వూళ్ళో స్కూళ్లు ఎన్ని ఉన్నాయి అని హోటలు మేనేజరును అడిగాను.

రెండు హైస్కూళ్ళు, ఆరు ట్యుటోరియల్ కాలేజీలు ఒక మహిళా విద్యాలయం, ఒక సంగీత పాఠశాల వున్నాయి.

మొట్ట మొదట బయలుదేరి ఆడపిల్లల స్కూలుకు వెళ్ళాను. శ్యామల అనే పేరుగల టీచర్లు ముగ్గురు శ్యామల అనే పేరుగల విద్యార్థినులు ఎనిమిది మంది కనిపించారు. అందరూ ఆరోగ్యంగా హాయిగా వున్నారు. ఎవ్వరికీ కూడా సీరియస్‌గా లేదు. అంతేకాదు అందులో ఎవ్వరికీ నా పేరు తెలియదు. నాకు టెలిగ్రాము ఎవ్వరూ ఇవ్వలేదు. అప్పుడక్కడ ఇంకొక విషయం తెలిసింది. మొగపిల్లల స్కూళ్ళలో కూడా ఆడ టీచర్లు పనిచేస్తున్నారని.

అక్కడనుంచి బయలుదేరి సంగీత విద్యాలయంకు వెళ్ళాను. నా దగ్గరవున్న టెలిగ్రాము ప్రిన్సిపాల్‌కు చూపించాను. ఆయన స్కూల్లో శ్యామల అనే టీచరు లేదుకాని సరస్వతి అనే టీచరు వుండేది. చాలా బుద్ధిమంతురాలు ఎంతో మంచిగా వుండేది. కాని ఇంతలో ఆ వూళ్ళో త్యాగరాజగాన సభలకు ఒక బ్రహ్మచారి గాయకుడు వచ్చాడుట. అతని పాట వినడమేమిటి ఈ అమ్మాయి అన్ని విధాల మారిపోయిందట. సభ ముగిసేవేళకు వాళ్ళు యిద్దరూ దంపతులయ్యారు.

ఫైనలు యియరు పిల్లలకు డిప్లొమా పరీక్షలన్న విషయం కూడా పట్టించుకోకుండా అవిశ్వాస ఘాతకురాలు కాపురానికి వెళ్లిపోయిందట.

'కాలం ఇలా మారిపోయింది. మంచికి పోతే చెడు ఎదురవుతోంది" అంటూ ఆవిడ తనని చూసి తానే జాలిపడింది.

"నిజమేనండి ఇది కలియుగం. పూర్వకాలపు ఆపేక్షలు అంతఃకరణాలు యీనాడు ఎక్కడ వుంటాయి", అంటూ ఆవిడను నాకు చేతనైన పద్ధతిలో ఓదార్చాను. ట్యుటోరియల్ కాలేజీల్లో కూడా ఒకరు యిద్దరు శ్యామలలు కలిశారు కాని వారికి యీ వ్యవహారం ఏమీ తెలియదు.

అక్కడనుంచి బయలుదేరి మొగపిల్లల హైస్కూలుకు వెళ్ళాను. సరాసరి హెడ్ మాష్టరుగారి దగ్గరకు వెళ్లాను. చూడడానికి మనిషి చాలా సౌమ్యుడిలాగా కనిపించాడు.

నమస్కారమండి అని అన్నాను. ఆయన తల ఎత్తకుండానే కూర్చోమని సౌంజ్ఞ చేశాడు.

నేను మెల్లగా "శ్యామలా..." అంటూ ఏదో చెప్పబోయాను. ఆయన ఒకసారి తాటి ప్రమాణంగా త్రాచు పాములాగా నామీదకు లేచాడు.

ఎవ్వరునువ్వు. అసలునీకు మా శ్యామలతో ఏం పని. ప్రతివాడికి యిదొక నాటకమైపోయింది. ఏ వూళ్లో చూశావు మా అమ్మాయిని? ఏ సాని కొంపలో చూశావు? ఆ విషయం చెప్పటానికేనా ఇంతదూరం వచ్చావు.

మా.అమ్మాయి లేచిపోయింది. సినిమాల్లో జేరతానని మదరాసు పారిపోయింది. అక్కడ చేరినాక సానిగా మారింది. ఈ విషయాలన్ని నాకు తెలుసునయ్యా నువ్వే క్రొత్తగా చెప్పనక్కర్లేదు.

నేను "సార్!" అని పొలికేక పెట్టాను.

ఆయన ఉలిక్కి పడి నావంక చూశాడు. ఆ కోపమంతా ఏమైందో ఏమో ముఖంలో చాలా దైన్యం కనిపిస్తోంది.

"వెళ్ళు నాయనా. వెళ్ళు శ్యామలని గురించి నువ్వు నాకేం చెప్పనక్కర్లేదు"

"నా మాట వినండి సార్

ఎవ్వనిమాట విన్నా లాభంలేదు నాయనా

పోనీ ఈ టెలిగ్రాము చూడండి.

ఆయన అయిష్టంగానే ఆ టెలిగ్రాము తీసుకున్నాడు... ఒకటి రెండుసార్లు చదివాడు. నాకు తిరిగి యిచ్చివేస్తూ ఆ పేరుగల వ్యక్తి ఇక్కడ ఎవ్వరూ లేరు, అని అన్నాడు. నేను మనస్సులోనే ఆయనకు నమస్కరించి బయటకు వచ్చాను.

ఇక ఒకే ఒక స్కూలు మిగిలింది. అక్కడ వుంటే వుంటుంది లేకపోతే ఆ వూళ్లో వున్న హాస్పిటలులో వాకబు చేద్దామని ఆ స్కూలు దగ్గరకు వెళ్ళాను.

"స్కూలు మూసేసి వుంది. ఒక వాచ్‌మన్ మాత్రం వున్నాడు. నా మనస్సు కీడు శంకించింది.

స్కూలు మూసేశారేం!" అని అడిగాను.

"పంతులమ్మగారు పోయారు"

ఆవిడ పేరేమిటి

"శ్యామలా టీచరు,"

శ్యామలా టీచరు మరణించింది.

"ఎప్పుడు?" అని అడిగాను

ఈరోజు ఉదయమే... మీరు ఆవిడ బంధువులా.

అవును నాయనా ఈ ఊరికి పరాయివాడిని ఆమె ఇంటిదోవ చూపిస్తావా...

ఆ మనిషి ఒక్క క్షణం తటపటాయించాడు.

నేను స్కూలు వదిలిపెట్టి రాకూడదు... రిక్షావాడికి దోవ చెబుతాను, వాడు తీసుకువెడతాడు.

సరే రిక్షా పెద్ద పెద్ద వీధులు, అందమైన భవంతులు దాటి చిన్న చిన్న సందుల గుండా వెళ్ళి ఒక చిన్న యింటిముదు ఆగింది.

ఇల్లంతా అంతులేని నిశ్శబ్దం, ఇంటిముందుగాని, ఇంట్లోగాని ఎక్కడా జనం వున్న అలికిడేలేదు.

శ్యామల టీచరు మరణించింది. దహనం కూడా ఈ పాటికి అయిపోయి వుండాలి.

నేను వెళ్లి ఎవరిని చూడాలి. ఎవరిని పరామర్శ చెయ్యాలి.

"తిరిగి వెళ్లిపోతే!"

"సార్ !" అని రిక్షావాడు పిలిచాడు.

నేను మళ్లీ ఈ లోకంలోకి వచ్చాను.

ఆ యింట్లోకి వెళ్ళాను. ఒక యిరవై అయిదు సంవత్సరాల వ్యక్తి కనిపించింది.

నేను మాట్లాడకుండా టెలిగ్రాము ఆవిడ చేతిలో పెట్టాను.

"నేనే సరస్వతిని" అని అంది.

నేనేం మాట్లాడలేదు.

కూర్చోండి.

కూర్చున్నానన్న మాటేకాని నా కళ్ళు అక్కడవున్న ఫొటోలన్నీ వెదుకుతున్నాయి. కాని సమాధానం దొరకలేదు.

సరస్వతి ఏదో ఆలోచిస్తోంది.

"అసలేం జరిగింది?"

అన్యాయమే జరిగింది.

ఎందుకని?

నమ్మించి మోసం చేయటం కన్న అన్యాయం యింకా ఏముంది?

కొంచెం విడమరిచి చెప్పండి.

పెళ్ళి చేసుకుంటానని ప్రమాణం చేసి సర్వస్వం దోచుకుని తీరా సమయం వచ్చేసరికి కాదని ఈసడించేసరికి తట్టుకోలేకపోయింది.

ఎవరతను?

మాటతప్పిన మనిషి

అతనికొక పేరుందిగా.

ఆపేరు తలవడాని కూడా నాకు అసహ్యం.

శతృవు పేరు తెలియకుండా ప్రతీకారం తీర్చుకోవడం ఎల్లా?

చంద్రశేఖరం.

ఎక్కడ వున్నాడు.

ఇప్పుడు ఎక్కడ వున్నాడో తెలియదు.

నాకు టెలిగ్రాము ఇవ్వమని ఎవ్వరు చెప్పారు!

ఎవ్వరూ చెప్పలేదు శ్యామలా టీచరు తాలూకు వ్యక్తులెవరైనా వున్నారా! అని ఆవిడ కాగితాలన్నీ గాలించాం. ఒక డైరీలో మీ అడ్రసు కనిపించింది. దాని ప్రకారం మీకు టెలిగ్రాము ఇచ్చాం!

డైరీలో ఎడ్రెసు!!

ఒకసారి ఆ డైరీ నేను చూడవచ్చునా!

సరస్వతి లోపలికి వెళ్ళి డైరీ పట్టుకుని వచ్చింది.

ఆ డైరీ వంక ఒక్కసారి చూశాను. నా సందేహాలన్నింటికి సమాధానాలు దొరికాయి.

శ్యామల ఎవరో ఎల్లా వుంటుందో అని తెలుసుకోవలసిన అవుసరం నాకిహలేదు.

ఇక్కడనుంచి వెంటనే వెళ్ళిపోవాలి చాలా దూరం వెళ్ళిపోవాలి. ఈ టెలిగ్రాము ఈ వూరు వచ్చిన విషయమే మరిచిపోవాలి.

ఏమండి అని సరస్వతి పిలిచింది.

నేను ఉలిక్కిపడ్డాను.

శ్యామలా టీచరు మీకేమవుతారు!

బ్రతికివున్నంత కాలమే ఒకరికొకరు బంధువులు,

నిజమే

'నేను వెడతాను' అంటూ లేచాను.

అప్పుడేనా

వచ్చిన పని అయిపోయింది.

ఒక్కసారి మా హెడ్‌మాష్టరు గారిని కలుసుకొని వెళ్ళండి.

మేము ఇద్దరం కలిసి ఆయన ఇంటికి వెళ్లాం. " శ్యామల టీచరుగారి బంధువులు' అని నన్ను పరిచయం చేసింది.

ఆయన నా వంక కోపంగా చూశారు. మాట్లాడకుండా నా చేతిలోని టెలిగ్రాము ఇంకొక సారి చదివాడు. కుర్చీలోంచి లేచి గాద్రెజ్ బీరువాలోంచి ఒక కాగితం తీసి నా చేతికిచ్చాడు.

"జీవితంమీద రోత కలిగి నేను వెళ్ళిపోతున్నాను. నా జీవితానికి, మృత్యువుకు కూడా నేనే బాధ్యురాలిని... నా కంటూ ఏవైనా వుంటే వాటిని దూరంగా వున్న ఏ అనాధ శరణాలయానికన్నా ఇవ్వండి..."

శ్యామల.

ఆ కాగితాన్ని తిరిగి ఆయనకే ఇచ్చేశాను. చూస్తూ వుండగానే ఆ కాగితం అణువుకన్నా చిన్న చిన్న ముక్కలుగా చిరిగిపోయింది.

ఇహ అక్కడ నేను ఒక్క క్షణం కూడా నిలవలేదు బయలుదేరి సరాసరి మా వూరు వచ్చేశాను.

ఇంటికి రాగానే అంతా కలసి ఒక్కసారిగా అడిగారు.

ఎల్లా వుంది!

నేను వెళ్ళేసరికే అంతా అయిపోయింది.

పాపం!! అని అంతా నన్ను ఓదార్చారు.

ఆ అమ్మాయి ఎవరు అని ఇంకొక ప్రశ్న వచ్చింది.

పది సంవత్సరాల క్రితం నా దగ్గర టైపిస్టుగా వున్న పిల్ల.

"అల్లాగా" అని అంతా ఇంకొకసారి జాలిపడ్డారు.

ఆ రోజు రాత్రి మేమిద్దరం ఒటరిగా వున్నప్పుడు మా ఆవిడ.

"మీ టైపిస్టు పేరు కమల నాకు బాగా జ్ఞాపకం. ఈ శ్యామల ఎవరండి?" అని అడిగింది.

"రెండు సంవత్సరాల క్రితం నేను ఢిల్లీనుంచి వస్తుంటే నాకు బాగా జ్వరం వచ్చింది. దాదాపుగా స్పృహ లేకుండానే ప్రయాణం చేశాను. బెజవాడలో దిగి చూసుకుంటే నా పర్సు, నాడైరీ కనిపించలేదు. రైలు టికెట్టు మాత్రం నా చొక్కా జేబులో కనిపించింది. ఆ దొంగ ఎవరో తెలిసింది" అని అన్నాను.

మా ఆవిడ నా వంకచూచి " ఆడైరి, ఆ పర్సు... "అని ఆపేసింది.

నేను "అవును" అని అన్నాను.

తను నా చేతిని తన చేతిలోకి తీసుకుని "అదంతా మరచిపోండి... చచ్చిపోయిన వారిని గురించి చెడ్డగా తలచకూడదు" అని అంది.

# చివురంటి చిన్నది

నీటైన చిన్నవాడా
నిన్నె నమ్ముకుంటినోయి
చివురంటి చిన్నదాన్నోయి దొరా!
చావున్న చిలకనోయి దొరా! !

అంటూ కలలో కలువరిస్తోంది ఒక అలికులవేణి తూరుపు తెలతెలవారకుండానే, కల కలమని పక్షిగణం చెదరకమునుపే రాత్రి అంతా ముచ్చటలతో, మైమరపించిన తియ్యటి కలలో ఆదమరచిన చిన్నదానిని నిదుర మేల్కొల్పటం ఎంతటి చిక్కు ప్రశ్న ! ! ఎటువంటి గడ్డుసమస్య !! కలలతో మేల్కొని, మెలుకువలో నిదురపోయేవారిని సుషుప్తినుంచి జాగృతికి తీసుకురావడం ఆ లీలామానుష విగ్రహానికే సాధ్యం కాదే !! తలచెడి వయస్సు వుడిగి, పడుచుదనం పరుగుని మరిచిపోయిన ఆండాళ్ళమ్మకేం అర్థమవుతుంది.

ఆవిడకి అర్థమైందల్లా "మా కాలంలో యిటువంటివి ఎరగవమ్మా !!